బాలికల భవితకు కిశోరి వికాసం

- నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు
- ఆరోగ్య పరిరక్షణ, సామాజిక అంశాలు, చట్టాలపై చైతన్యవంతం
- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా రూపకల్పన



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీతారామపురం : సమాజంలో కౌమార దశకు చేరుతున్న బాలికలు ఆరోగ్య సమస్యలు, ఇతర ఒడిదుడుకులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కిశోరి వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మహిళా శిశు సంక్షేమ శాఖ వేసవి సెలవుల్లో కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టింది.బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఇతర శాఖలను సమన్వయం చేసుకుని సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించింది.మే 2 నుంచి జూన్ 10 వరకు ఈ కార్యక్రమాలను చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డీఆర్డీఏ, వీఆర్ఏ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, తదితరులతో కూడిన బృందాలు గ్రామాల్లో కిశోర బాలికలకు ఆరోగ్యం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆత్మరక్షణ, బాల్యవివాహాలకు దూరంగా ఉండడం, తదితర విషయాలపై అవగాహన కల్పించనున్నాయి

షెడ్యూల్ ఇలా...

మే 2న బాలికల పరిచయం, 6న రుతుక్రమ పరిశుభ్రత, లైంగిక విద్య, 9న బాల్య వివాహాలు, పునరుత్పత్తి ,ఆరోగ్యంపై ప్రభావాలు, 13న పిల్లల హక్కులు, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, పోక్సో చట్టం, 16న కౌమార దశలో రక్తహీనత, 20న లింగ అసమానత, ఆడపిల్లలపై వివక్ష, 23న విద్య, కెరీర్‌పై సూచనలు, నైపుణ్య ప్రాముఖ్యత, 27న సైబర్ రక్షణ, ఆన్‌లైన్‌లో భద్రత, సమస్యలు, 30న ఆర్థిక అంశాల నిర్వహణ, జూన్ 3న బాలికల నాయకత్వ లక్షణాలు, సాధికారత, జూన్ 6న క్రీడలు, యోగా, వ్యాయామం, జూన్ 10న బాల్యవివాహాల నిర్మూలన, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు.

గ్రామస్థాయిలో కమిటీ

కిశోరి వికాసం కోసం గ్రామ వార్డు స్థాయిల్లో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా ఐదుగురితో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. అందులో అంగన్‌వాడీ టీచర్, బహుళార్థ సాధక ఆరోగ్య కార్యకర్త, గుర్తింపు పొందిన ఆరోగ్య కార్యకర్త, సచివాలయ ఆర్గనైజింగ్ అసిస్టెంట్ ముఖ్యపాత్ర పోషిస్తారు. ఈ కమిటీ కౌమార బాలికల వివరాలను సేకరించి బృందాలుగా ఏర్పాటు చేసి వారితో సమావేశమై మార్గదర్శకం చేస్తుంది. వీటి ఏర్పాటులో మహిళా సంరక్షణ కార్యదర్శి కీలకంగా వ్యవహరించనున్నారు. మిగిలిన నలుగురు సభ్యులు సహకరిస్తారు. మహిళా సంరక్షణ కార్యదర్శి లేని చోట అంగన్‌వాడీ టీచర్లే పర్యవేక్షిస్తారు. పంచాయతీ కార్యదర్శి, స్థానిక పాఠశాల హెచ్‌ఎం, ఏఎన్ఎంలు అవసరమైతే సహకరిస్తారు.

కౌమార బాలికలను గ్రూపులుగా విభజన

జిల్లాలో 14 నుంచి 18 ఏళ్లలోపు ఉన్న బాలికలు, అలాగే బడి మానేసిన 11 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలను గుర్తించి వారిని గ్రూపులుగా విభజిస్తారు. వారికి ఎంపిక చేసిన అంశాలపై ఆయా ప్రాంతాల్లో బాలికలకు అనువైన సమయంలో గంటపాటు శిక్షణ ఇస్తారు. ఇటీవల కాలంలో బాలికలే లక్ష్యంగా మోసాలు అధికమయ్యాయి. ముఖ్యంగా ప్రేమ పేరుతో కొందరు వారిని వంచనకు గురి చేస్తున్నారు. మరికొందరు రాజీ పేరుతో బాల్యవివాహాలు జరిపిస్తున్నారు. బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించి వారు ఆయా అంశాల్లో సమర్థంగా ఉండేలా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు.

బాల్యవివాహాలకు అడ్డుకట్ట పడేనా?

గ్రామీణ ప్రాంతాల్లో వేసవి సెలవుల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుంటాయి. బాల్యవివాహాలు చట్టరీత్యానేరమైన తల్లిదండ్రులకు అవగాహన లేక చేస్తున్నారు. ఎవరైనా సమాచారం అందిస్తే తప్ప అడ్డుకోవడం మినహా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో నిఘా ఉంచలేకపోతోంది. బాలికలను చైతన్యవంతం చేయడం ద్వారా అడ్డుకట్ట వేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. బాల్య వివాహాలను ఎక్కువగా 15 నుంచి 17 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలకు చేస్తున్నారు. దీంతో ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా వారికి పుట్టే పిల్లలు బలహీనంగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు.వాటి నిర్మూలనకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు. ఏ ప్రాంతంలో అయిన బాల్య వివాహాలు చేస్తున్నా, ప్రోత్సహిస్తున్నా టోల్ ఫ్రీ నంబర్ 1098కు ఫిర్యాదు చేయవచ్చు. బాల్యవివాహాల కట్టడికి సమాజంలోని ప్రతిఒక్కరూ తమ వంతు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాం



కిశోరి వికాసం ద్వారా బాలికల్లో ఆత్మస్థైర్యాన్నిపెంపొందించేలా ప్రణాళికలు రూపొందించాం. వేసవి సెలవులు కిశోర బాలికలకు ఉపయోగపడే విధంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలికలకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించి చైతన్యవంతం చేస్తున్నాం. తద్వారా సమాజంలో మార్పునకు శ్రీకారం చుడుతున్నాం.
– షేక్ షాను, ఐసీడీఎస్ సూపర్‌వైజరు, దుత్తలూరు.

పూర్తిస్థాయిలో అవగాహన



కిశోరి వికాసంలో బాలికలకు ఎదురయ్యే సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తాం. ప్రస్తుత సమాజంలో బాలికలే లక్ష్యంగా మోసాలు పెరుగుతున్నందున నిర్దిష్ట ప్రణాళికతో వారికి అవగాహన కల్పించి అన్ని అంశాల్లో వారు సమర్థవంతంగా ఉండేలా చూస్తాం.
–సునీత, సీడీపీఓ, ఉదయగిరి.

ఎంతో ఉపయోగకరం



కిశోరి వికాసం వేసవి శిబిరాలు బాలికలకు ఎంతో ఉపయోగకరం. సమాజంలో ఎలా మెలగాలో వివరిస్తాం. బాలికలకు హక్కులు, నైపుణ్యాల పెంపు, బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తాం. బాలికలకు ఏదైనా సమస్య తలెత్తినప్పుడు దాన్ని పరిష్కరించుకునే విధంగా వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించేలా చర్యలు తీసుకుంటాం.
– సువర్ణ, పీడీ, ఐసీడీఎస్

క్లుప్తంగా

ముగిసిన సీతారాముల ఉత్సవాలు



ఉదయగిరిరూరల్: గంగులవారి చెర్లోపల్లిలో జరుగుతున్న సీతారాముల ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు వసంతోత్సవం, పారువేటను వేడుకగా జరిపారు.

మంత్రికి వినతి

వింజమూరు(ఉదయగిరి):రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, రెఫరల్ ఆస్పత్రుల్లోని సమస్యలను పరిష్కరించాలని అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్సిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) నేతలు కోరారు. ఈ మేరకు వింజమూరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర కార్యదర్శి వెంగయ్య, ప్రతినిధులు తిరుపాల్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి,శ్రీ నివాసరెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకు గరిష్టంగా రూ.280 ధర పలికింది. వేలానికి 682 బేళ్లు రాగా, 550 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.210, సగటున రూ.250.06 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

పరామర్శ



ఆత్మకూరు/ఆత్మకూరురూరల్: పట్టణం, మండలానికి చెందిన పలువురిని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శనివారం పరామర్శించారు. పట్టణంలోని జేఆర్‌పేటకు చెందిన సోమవరపు సుబ్బారెడ్డి ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో వాటి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సోమవరపు భాస్కర్‌రెడ్డిని అడిగి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. అలాగే పాతజంగాలపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండల వైఎస్సార్ సీపీ నాయకుడు గడ్డం శ్రీనివాసులురెడ్డి సోదరుడు విజయభాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆయన వెంట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆదిశేషయ్య, పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, వెంగళరెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, తోడేటి అశోక్, తదితరులు ఉన్నారు.

ఆధార్ నమోదుపై దృష్టి

సీతారామపురం : చిన్నారులకు ఆధార్ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ ఎంపీడీఓ భార్గవిరెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పుట్టిన ప్రతిబిడ్డకు ఆధార్ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ భాస్కర్ పాల్గొన్నారు.

సన్మానం

జలదంకి: వింజమూరు పర్యటనకు వెళ్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను జలదంకి బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శాలువాలతో సత్కరించారు. అనంతరం మంత్రి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కాగా మంత్రి పర్యటనలో భాగంగా వచ్చిన ఆర్టీసీ చైర్మన్ నన్నపురెడ్డి సురేష్‌రెడ్డి జలదంకి బస్టాండ్‌ను సందర్శించారు. బస్టాండ్ అపరిశుభ్రంగా ఉండడం గమనించి పారిశుధ్యాన్ని మెరుగుపరిచి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

చిరుద్యోగుల తొలగింపులో మెలిక

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం మాముడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వాచ్‌మెన్ గంగపట్నం చిన్నబ్బయ్య, స్వీపర్ గంగపట్నం పెంచలమ్మను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్ధాంతరంగా గత ఆగస్టులో తొలగించిన విషయం తెలిసిందే. దీంతో వారు హైకోర్టును ఆశ్రయించగా రెండు నెలల క్రితం వారి దగ్గర సంజాయిషీ తీసుకొని విధుల్లో చేర్చుకోవాలని ఆదేశించింది. అయితే హైకోర్టు ఆదేశాలను హెచ్‌ఎం శ్రీనివాసులు అమలు చేయకపోగా , డీఈఓ సైతం స్థానిక టీడీపీ వారితో మాట్లాడుకుని రాజీ చేసుకోవాలని సూచించడం గమనార్హం. ఈ నేపథ్యంలో బాధితులు మరోమారు హైకోర్టును ఆశ్రయిస్తామనడంతో ఎట్టకేలకు శుక్రవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. అయితే ఎంఈఓ, హెచ్‌ఎంల సమక్షంలో బాధితుల వద్ద సంజాయిషి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినా దానిని భేఖాతరు చేస్తూ విద్యాశాఖ అధికారులు పాఠశాల తల్లిదండ్రుల కమిటీ పేరుతో 40 మందికిపైగా టీడీపీ మద్దతుదారులను పిలిపించి వారి సమక్షంలో సంజాయిషి ఇవ్వాలని కోరడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏ పాఠశాలలో లేని విధంగా 40 మంది తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఎలా వచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాగా బాధితుల సంజాయిషి విన్న ఎంఈఓ, హెచ్‌ఎం తల్లిదండ్రుల కమిటీ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని మెలికపెట్టి అర్ధాంతరంగా విచారణను ముగించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

జలదంకి: బోయిలపాడులో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సీతారాముల శాంతి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఉభయదాతలుగా ఎం వేణుగోపాల్‌రెడ్డి, వీ శ్రీనివాసులరెడ్డి, జీ ప్రభాకర్‌రెడ్డి, మాల్యాద్రిరెడ్డి, సుబ్బారెడ్డి, బలరామిరెడ్డి, వీరరాఘవరెడ్డి, వెంకటరామిరెడ్డి వ్యవహరించారు.

కావలిలో మంత్రి సత్యకుమార్ బస

కావలి: రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ శుక్రవారం రాత్రి కావలి పట్టణానికి చేరుకుని పోలీస్ అతిథి గృహంలో బస చేశారు. శనివారం జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి ఉదయాన్నే లేచి పురవీధుల్లో నడుస్తూ సామాన్యుడిలా అందరితో మాట్లాడారు.

అగ్ని ప్రమాదంలో వృద్ధురాలి మృతి



మర్రిపాడు: అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రాంపల్లికి చెందిన పోకూరి వెంగమ్మ(71) శుక్రవారం ఇంట్లో వంట చేస్తుండగా చీరకు మంటలు అంటుకున్నాయి. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. శనివారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారికి అప్పగించారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు

సంగం: మండలానికి పాఠ్యపుస్తకాలు శనివారం చేరాయి. తొలివిడతగా 14,540 పుస్తకాలు రాగా సంగం ఉన్నత పాఠశాలలో భద్రపరిచినట్లు ఎంఈఓ మల్లయ్య తెలిపారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ రాష్ట్రాధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జలదంకి, కొండాపురం మండలాలకు నూతన కమిటీలను నియమించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

- జలదంకి మండలాధ్యక్షుడిగా ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా తమ్మినేని సతీష్‌నాయుడు, వట్టికాల బాలయ్య, ప్రధానకార్యదర్శులుగా గణాది రవీచంద్ర, వనేరు గోవర్ధన్‌రెడ్డి, ఎస్‌కే మస్తాన్‌షరీఫ్, కోశాధికారిగా గంధు వెంకారెడ్డి, కార్యదర్శులుగా వేలమూరి చైతన్యరెడ్డి, పుచ్చకట్ల వెంకటేశ్వర్లు, వట్టికాల వరకుమారి, వంటేరు లక్ష్మీనరసారెడ్డి, గుమ్మడి రమేష్‌ను నియమించారు. సభ్యులుగా తాటిపర్తి యలమందయ్య, ఆవుల చిన్నరాఘువరెడ్డి, వర్షినేని మధుసూదన్‌రెడ్డి, పులిమి రవీంద్రరెడ్డి, డేగా సురేష్, గంగపట్ల యేసురత్నం, ఎలసారి రవి, సానా శ్రీనివాసరెడ్డి, పులిమి బాబులరెడ్డి, గుమ్మలపాటి సుబ్బారావు, అత్తిన శ్రీనివాసులు, దండా అనిల్‌కుమార్‌రెడ్డి, దేవరపల్లి శ్రీనివాసరెడ్డి, యర్రంరెడ్డి కృష్ణారెడ్డి, బడే వినయ్‌కుమార్‌రెడ్డి, గంధు సంపూర్ణ, దేవండ్ల చెంచురామయ్య నియమితులయ్యారు.
- కొండాపురం మండల ఉపాధ్యక్షులుగా యేరువ వెంకటేశ్వర్లు, దేవులూరి చిన్నకొండయ్య, ప్రధానకార్యదర్శులుగా పడకలూరి శ్రీనివాసులు, యరజాల మాల్యాద్రి, మేడం బలరామిరెడ్డి, కోశాధికారిగా కోనేటి లక్ష్మణ, కార్యదర్శులుగా శీలం మల్లికార్జున, గడ్డం ప్రసాద్‌రెడ్డి, మార్పుల వెంగయ్య, వీరేళ్ల చంద్రయ్య, డబ్బుగొట్టు కాశయ్య నియమితులయ్యారు. సభ్యులుగా షేక్ రంతుల్లా, బేజవాడ ప్రకాశం, మందల జీవన్‌బాబు, చెన్నుబోయిన మస్తానమ్మ, నేలపాటి మల్లికార్జున, తేలమేకల ఉమామహేశ్వరావు, రావూరి అంకయ్య, నల్లబోతుల శ్రీనివాసులు, మద్దిబోయిన వరమ్మ, చిమ్మిల్లి అంకయ్య, మందా సత్యవేణి, గున్నా ప్రసాద్, కడవటగంటి అంథోని, మాలగల తిరుపతమ్మ, జాలంకి శివయ్యను నియమించారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



ఆత్మకూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లింలు

ఆత్మకూరు: వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ముస్లింలు డిమాండ్‌చేశారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు పట్టణంలోని సత్రం సెంటర్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ముస్లింలకు మద్దతుగా పలు పార్టీల నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. బీఎస్సార్ సెంటర్ వద్ద ర్యాలీని ఉద్దేశించి జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆదిశేషయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్ రెడ్డి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం మతసామరస్యాన్ని దెబ్బతీసేలా ఉందన్నారు. దీనిని దేశవ్యాప్తంగా ముస్లింలు వ్యతిరేకిస్తున తరుణంలో చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పులిమి రమేష్ రెడ్డి, కౌన్సిలర్ కామాక్షయ్యనాయుడు, పలు పార్టీల నాయకులు ముజీబ్, సయ్యద్ జమీర్, షేక్ సందానీ, డేవిడ్‌రాజు, యస్దానీ, నాగయ్య పాల్గొన్నారు.

పెంచలకోన బ్రహ్మోత్సవ కమిటీలో ఆత్మకూరువాసి

ఆత్మకూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల కమిటీలో ఆత్మకూరుకు చెందిన కిన్నెర నరసింహారావుకు చోటు దక్కింది. శనివారం పెంచలకోనలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా కిన్నెరకు పలువురు అభినందనలు తెలిపారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సోమశిల: సోమశిలలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి మూడో తరగతిలో ప్రవేశానికి గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రామకృష్ణయ్య శనివారం తెలిపారు. 3వ తరగతిలో 80 సీట్లు ఉండగా, ఎస్టీలకు 75, ఎస్సీలకు 2, బీసీలకు 1, ఓసీకు 1 ఏఈక్యు 1 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఎస్టీలకు సంబంధించి 4వ తరగతిలో 78 సీట్లు, 5వ తరగతిలో 74 సీట్లు, 6వ తరగతిలో 72 సీట్లు, 7వ తరగతిలో 56 సీట్లు, 8వ తరగతిలో 62 సీట్లు, 9వ తరగతిలో 48 సీట్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయనున్నట్లు వివరించారు. అర్హులైన వారు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దీర్ఘకాల సెలవుపై బోగోలు పంచాయతీ కార్యదర్శి

బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌జహీర్ వరుస వివాదాల నేపథ్యంలో దీర్ఘకాల సెలవుపై వెళ్లినట్లుగా తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బోగోలు పంచాయతీ కార్యదర్శిగా విధుల్లో చేరిన అబ్దుల్ జహీర్, పంచాయతీ వార్డు సభ్యులకు మధ్యన వివాదం నెలకొంది. పంచాయతీ కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటం తొలగింపుపై వార్డు సభ్యులపై పంచాయతీ కార్యదర్శి పోలీసు కేసు సైతం పెట్టిన విషయం తెలిసిందే. ఆ తరువాత అదే అంశంపై విచారణలు చేపట్టడం, ఉన్నతాధికారులకు పంచాయతీ కార్యదర్శిపై వార్డు సభ్యులు ఫిర్యాదు చేయడం జరిగింది. ఇంటి పన్నులు, నిధుల వినియోగంలో పారదర్శకత లోపించిందంటూ పంచాయతీ ప్రజలు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఇటీవల ప్రజావిజ్ఞప్తుల దినంలో కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

కుక్కల దాడిలో దుప్పి మృతి



కావలి: పట్టణంలోని జనాల నివాసాల మధ్యనే కాకుండా సమీప అటవీ ప్రాంతంలో కూడా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నారు. తాజాగా శనివారం పట్టణంలోని బాపూజీనగర్‌ను ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలో సుమారు నాలుగేళ్ల వయస్సు ఉన్న చుక్కల దుప్పిపై కుక్కలు దాడి చేశాయి. చుక్కల దుప్పి అరుపులను విన్న స్థానికులు కుక్కలను తరిమేసి దాన్ని కాపాడారు. అనంతరం గాయాలపాలైన చుక్కల దుప్పిని అటవీ శాఖ అధికారులకు అప్పగించగా హుటాహుటిన స్థానిక పశువుల ఆస్పత్రికి తీసుకెళ్లారు. దుప్పికి పిక్క వద్ద లోతైన గాయమై ఉండడంతో కుట్లు వేసేందుకు వైద్యుడు ప్రయత్నిస్తుండగా ప్రాణం విడిచింది.అనంతరం అటవీశాఖ సిబ్బంది చుప్పల దుప్పి కళేబరాన్ని దహనం చేశారు.

రోడ్డు పనుల పరిశీలన

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లి నుంచి డీసీపల్లి మీదుగా వింజమూరు మండలం నల్లగొండ్ల వరకు పీఎంజీఎస్‌వై పథకం కింద చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఎస్‌ఈ అశోక్ శనివారం పరిశీలించారు. రామస్వామిపల్లి- బంట్లపల్లి మధ్యన కల్వర్టుల నిర్మాణాలు, డీసీపల్లి సమీపంలో కాంక్రీట్ గోడలు, వెన్నవాడ-గండ్లవేడు మధ్యన నూతన రోడ్డు నిర్మాణం, బొగ్గేరుపై వంతెన, తదితరాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట ఆత్మకూరు పీఐయూ విభాగం డీఈ సుధాకర్‌రెడ్డి, పీఆర్ డీఈ ఏడుకొండలు, ఏఈ ప్రసాద్ ఉన్నారు.



మంత్రి ప్రసంగంపై అసక్తి చూపని జనం



మంత్రి సత్యకుమార్ ప్రసంగిస్తుండగానే ఖాళీగా దర్శనం ఇస్తున్న కుర్చీలు

వింజమూరు(ఉదయగిరి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వింజమూరు పర్యటనలో కూటమి నేతల మధ్య ఉన్న అనైక్యత స్పష్టంగా బయటపడింది. శనివారం వింజమూరు సీహెచ్‌సీలో జరిగిన డయాలసిస్ యూనిట్ ప్రారంభం కార్యక్రమం పేరుకు అధికారిక కార్యక్రమమైనప్పటికీ దాదాపు రాజకీయ సభ మాదిరిగానే జరిగింది. కార్యక్రమం నిర్వహణలో కొత్తగా టీడీపీలో చేరిన నేతల హవానే కనిపించింది. మొదటి నుంచి టీడీపీలో ఉన్న వారికి స్టేజీపై తగిన ప్రాధాన్యత లేకపోవడంతో వారు కొంత అసంతృప్తికి లోనయ్యారు. జనసేన, బీజేపీ ముఖ్యనేతలను కూడా స్టేజీపైకి పిలవకపోవడంతో వారు అసంతృప్తితో వెళ్లిపోయారు. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే చాలా మంది కుర్చీల్లో నుంచి లేచి వెళ్లిపోవడం కనిపించింది. నేతలు మాట్లాడుతుండగానే ముఖ్యంగా మహిళలు వెళ్లిపోవడంతో చాలా కుర్చీలు ఖాళీగా కనిపించాయి. మంత్రి సత్యకుమార్ ప్రసంగం ప్రారంభమైన కొద్దిసేపటికే సగం కుర్చీలు ఖాళీగా దర్శనం ఇచ్చాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం , కనీసం సౌకర్యాలు లేకపోవడం, తాగునీరు కూడా సరిగా లేకపోవడంతో దప్పికకు తాళలేక చాలా ఇబ్బంది పడ్డారు. ఈ కార్యక్రమం నిర్వహణ వైద్యాధికారుల ఆధ్వర్యంలో జరిగిందా...లేక కూటమి నేతల నేతృత్వంలో జరిగిందా..అనే అయోమయం అందరిలో నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా రాష్ట్ర మంత్రి అధికారిక కార్యక్రమానికి వచ్చినా పూర్తిస్థాయిలో విజయవంతం చేసుకోలేకపోయామనే భావన కూటమి నేతల్లో కనిపించింది.

బైపాస్‌రోడ్డే కల్లాం



వింజమూరు బైపాస్ రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న విత్తనాలు


వింజమూరులో మొక్కజొన్న సాగుచేసిన రైతులు నూర్పిళ్లు చేపడుతున్నారు. మొక్కజొన్నలను ఆరబెట్టునేందుకు సరైన వసతి సౌకర్యం లేక బైపాస్ రోడ్డును ఆశ్రయిస్తున్నారు. ఈ మార్గంలో అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాల డ్రైవర్లు ఏ మాత్రం ఆదమరిచి డ్రైవింగ్ చేస్తే మొక్కజొన్నల కుప్పలపైకి వాహనాలు వెళ్లి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రైతులు సైతం ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. వింజమూరు ప్రాంతంలో ఎక్కువ సంఖ్యలో రైతులు ఉన్నారు. ఏదాది పొడవునా ఏదోక రకం వ్యవసాయ ఉత్పత్తులు పండిస్తుంటారు. ఈ నేపథ్యంలో పంట ఉత్పత్తులను అరబెట్టుకునేందుకు ప్రత్యేకమైన ప్లాట్‌ఫామ్‌లు నిర్మిస్తే వారికి సౌకర్యవంతంగా ఉంటుంది. ఆ దిశగా పాలకులు, అధికారులు ఆలోచన చేయాలని రైతులు కోరుతున్నారు.
–వింజమూరు(ఉదయగిరి)

అడుగంటిన జలం



వేసవి నేపథ్యంలో గండిపాళెం బీసీకాలనీలోని చేతిబోరులో నీరు అడుగంటింది. అరగంటసేపు చేతిపంపును కొట్టినా బిందె నీరు రావడం కష్టంగా మారింది. దీంతో స్థానికులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చేతిబోరుకు అదనపు పైపులు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.
–ఉదయగిరిరూరల్

ఉత్తరకాలువలో వ్యర్థాలు



34ఆర్ పాయింటు వద్ద ఉత్తరకాలువలో పేరుకున్న వ్యర్థాలు

సోమశిల ఉత్తరకాలువలో వంతెనల వద్ద వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి. సోమశిల ప్రాజెక్ట్ నాల్గో డివిజన్ పరిధిలో అనంతసాగరం మండలం మొదలుకుని ఆత్మకూరు మండలం రామస్వామిపల్లి, బంట్లపల్లి, మర్రిపాడు మండలం డీసీపల్లి, ఆత్మకూరు చెరువుకు సాగునీరు సరఫరా చేసే ఏటీ చానల్ వరకు ఉన్న వంతెనల వద్ద ప్లాస్టిక్‌తో పాటు ఇతర వ్యర్థాలు పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. సోమశిల అధికారులు స్పందించి ఉత్తరకాలువలోని వ్యర్థాలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.
–ఆత్మకూరురూరల్